నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 25 డిసెంబర్ 2023 | KARIMNAGAR

భయపడకు నేనున్నా..

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల భరోసా

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 24: మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేటలో ఆదివారం ఓ ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. పొలం కాడికి వెళ్లొచ్చే లోపే కాలిబూడిదైంది. దీంతో గడ్డం చిన్నోళ్ల పెద్దస త్తయ్య కుటుంబం కన్నీరుమున్నీరైంది. ఇంట్లో దాచుకున్న ₹4.20 లక్షల నగదు, పది తులాల బంగారం, సామగ్రి కాలిపోయిందని విల పించింది. కాగా, విషయం తెలుసుకున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల వెంటనే అక్కడకు చేరుకొని, బాధితులను ఓదా ర్చారు. 'భయపడకు.. మీకు నేనున్నా' అంటూ ధైర్యమిచ్చారు. సొంతంగా ₹పది వేల సాయం అందించారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్ శ్రీధర్, ఎంపీటీసీ నోముల గంగాధర్ ఉన్నారు.

బాధితుడిని ఓదారుస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కంటి ఆపరేషన్లు చేసిన అనంతరం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ప్రజా వైద్యుడు.. సేవాతత్పరుడు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 24: ఓవైపు ప్రజాప్రతినిధిగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, మరోవైపు వైద్యుడిగా సాయమూ చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజలే తన కుటుంబ సభ్యుల్లా భావిస్తూ ఉచితంగా కంటి వైద్య సేవలు అందిస్తు న్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పావని కంటి దవా ఖాన, ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 12 మంది పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి కంటి అద్దాలు, మందులు అందజేశారు. శస్త్ర చికిత్స చేయించుకున్నవారు తీసుకోవా ల్సిన జాగ్రత్తల గురించి వారికి వివరించారు.

హ్యాపీ క్రిస్మస్

క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. కరీంనగర్‌లోని లూర్దుమాత, వెస్లీ సెంటినరీ, సీఎస్ఐ వెస్లీ కేథడ్రల్ చర్చిలతోపాటు ఉమ్మడి జిల్లాలోని చర్చిలన్నీ విద్యుద్దీపాలతో వెలిగిపోతున్నాయి. సోమవారం వేడుకలు అంబరాన్నంటనుండగా, ఆదివారం అర్ధరాత్రి తర్వాతి నుంచే ప్రత్యేక ప్రార్థనలు మొదలయ్యాయి.

- కమాన్ చౌరస్తా, డిసెంబర్ 24

మంచు కురిసే వేళ లో..

చలి వణికిస్తున్నది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతుండగా, ఉమ్మడి జిల్లా మరింత శీతలంగా మారుతున్నది. పల్లె ప్రాంతాలే కాదు, పట్టణ ప్రాంతాల్లోనూ మంచు దట్టంగా కురుస్తున్నది. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు కరీంనగర్ శివారు జగిత్యాల ప్రధాన రహదారిలో పొగమంచు కమ్మేసింది. సూర్యోదయమైనా మంచు తెరలు తొలగకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. దాదాపు అంతటా ఇదే పరిస్థితి కనిపించింది.
– కరీంనగర్ ముకరంపుర, డిసెంబర్ 24

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి

కరీంనగర్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు రంగారెడ్డి, పొన్నం ప్రభాకర్‌కు హైదరాబాద్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించింది. ఇన్‌చార్జి మంత్రి నియామకంతో ప్రజా పరిపాలన, అభివృద్ధిపై సమీక్ష, పర్యవేక్షణ నిర్వహించే అవకాశముంటుంది.

లోక్‌సభ ఎన్నికలకు వడివడిగా..



- ప్రాథమిక ఏర్పాట్లలో అధికారయంత్రాంగం
- సెక్టోరల్ అధికారుల నియామకాల కోసం ఈసీకి ప్రతిపాదనలు
- ప్రతి 1500 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం
- ముమ్మరంగా కొనసాగుతున్న సెంటర్ల రేషనలైజేషన్
- మరోవైపు వేగంగా ఓటరు జాబితా సవరణ
- మరింత పెరగనున్న ఓటర్ల సంఖ్య
- సమాయత్తమవుతున్న పార్టీలు

లోక్‌సభ ఎన్నికలు ముందస్తుగా వస్తాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు వడివడిగా సాగుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో యావత్ యంత్రాగం సిద్ధమవుతున్నది. ప్రతి 1500 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకుంటున్నది. అందుకోసం పోలింగ్‌కేంద్రాల రేషనలైజేషన్ కొనసాగుతుండగా.. సెక్టోరియల్ అధికారుల నియామకానికి సైతం అన్ని జిల్లాల యంత్రాంగం ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపించింది. మరోవైపు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతుండగా, అన్ని పార్టీలు రంగంలోకి దిగేందుకు కసరత్తు ప్రారంభించాయి.

కరీంనగర్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్ : లోక్‌సభ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం మందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నది. ప్రాథమిక పనులను వారం క్రితమే జిల్లాల్లో ప్రారంభించి, శరవేగంగా పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నది. ఎన్నికల సంఘం సూచించిన ఓటరు జాబితా, కొత్త ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణ, ఒక కుటుంబంలోని ఓట్లు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా, అవసరమైన చర్యలను ఇప్పటికే చేపట్టింది. తాజాగా, పోలింగ్ కేంద్రాల మార్పులు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన ఓటర్ల సంఖ్యపై క్షేత్రస్థాయిలో పరిశీలనలు కూడా జిల్లా ఎన్నికల అధికారులు చేపడుతున్నారు. ఎన్నికల నిర్వహణలో కీలకపాత్ర పోషించే రెవెన్యూ విభాగంలోని రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు నాలుగు రోజులుగా నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, అవసరమైన మార్పులు, చేర్పులపై సంబంధిత అధికారులకు నివేదికలు పంపుతున్నారు. ఇటీవల శాసనసభా ఎన్నికలు కూడా పటిష్టంగా నిర్వహించేలా ఎన్నికల సంఘం పలు చర్యలు చేపట్టింది. అయినా, కొన్ని ప్రాంతాల్లో చిన్నా చితక అవాంతరాలు ఏర్పడ్డాయి. కానీ, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అలాంటి వాటికి ఆస్కారం లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.

1500 మంది ఓటర్లకో పోలింగ్ కేంద్రం

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల సంఖ్య పెరిగినా, కొన్నిచోట్ల మాత్రం ఈసీ నిర్దేశించిన సంఖ్య కన్నా ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్నది. దీంతో పోలింగ్ సమయం ముగిసినా పలుచోట్ల ఓటర్లు బారులు తీరడం కనిపించింది. ఆయా కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం మరింత సరళతరం చేసే క్రమంలో ప్రతి 1500 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అందుకోసం పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌పై దృష్టి సారించారు. 1500 ఓటర్లకు మించి ఉన్నట్లైతే, వాటిని విభజించి రెండు పోలింగ్ కేంద్రాలు చేయడం, ఓటర్ల నివాసాలకు దూరంగా ఉన్న కేంద్రాలను దగ్గరగా మార్చడం, ఒక కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా జాబితా సరిచేయడం వంటి పనులు చేస్తున్నారు. ఓటర్ల సవరణ, తప్పొప్పుల పరిశీలన, మరణించిన వారి వివరాలు ఆధారాలతో సేకరించి జాబితాలోనుంచి తొలగించడం, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ముమ్మరం చేయడం వంటి పనులు చేపడుతున్నారు. అలాగే, ఎన్నికల నిర్వహణలో ముఖ్యపాత్ర పోషించే సిబ్బందికి అవసరమైన శిక్షణ, పోలింగ్‌కు అవసరమైన సామగ్రి సిద్ధం చేయడం, పోలింగ్ రోజున విధులు నిర్వహించే సిబ్బందికి పంపిణీ చేయడం, పోలింగ్ అనంతరం తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చడం వంటి ప్రణాళికను కూడా ముందస్తుగా సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణలో క్రియాశీల పాత్ర పోషించే సెక్టోరల్ అధికారుల ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసి, ఎన్నికల కమిషన్‌కు పంపారు.

కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలు, ఓటర్ల వివరాలు..

కరీంనగర్ లోక్‌సభ	
నియోజకవర్గం	ప్రస్తుతం ఉన్న ఓటర్ల సంఖ్య
కరీంనగర్	3,55,156
చొప్పదండి	2,33,188
మానకొండూరు	2,21,741
హుజూరాబాద్	2,49,722
హుస్నాబాద్	2,42,397
సిరిసిల్ల	2,44,532
వేములవాడ	2,22,304
మొత్తం	17,69,040

పెద్దపల్లి లోక్‌సభ	
నియోజకవర్గం	ప్రస్తుతం ఉన్న ఓటర్ల సంఖ్య
పెద్దపల్లి	2,54,530
రామగుండం	2,21,232
మంథని	2,36,597
ధర్మపురి	2,27,013
మంచిర్యాల	2,75,141
బెల్లంపల్లి	1,73,498
చెన్నూరు	1,88,417
మొత్తం	15,76,428

కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ

ఓటర్ జాబితా సవరణకే కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. 2024 జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. అంతే కాదు, ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటించాలని ఆదేశించింది. దీంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్పించేందుకు జిల్లా యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. కరీంనగర్, పెద్దపల్లి రెండు లోక్‌సభల పరిధిలోనూ ఏడేసి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అందులో కరీంనగర్ లోక్ సభ పరిధిలో 17,69,040 ఓటర్లు ఉన్నారు. అలాగే, పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో 15,76,428 మంది ఓటర్లు ఉన్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఇప్పటికే ఓటర్ల సంఖ్య రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ గణనీయంగా పెరిగింది. కాగా, తాజా ఓటరు జాబితా సవరణతో మరింత పెరిగే అవకాశమున్నది.

పార్టీలు సన్నద్ధం

మరోవైపు రాజకీయ పార్టీలు సైతం ఎన్నికలను ఎదుర్కోవడానికి సన్నద్ధమవుతున్నాయి. అందుకోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. కొన్ని పార్టీలు ఇప్పటికే ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. మరికొన్ని పార్టీలు రంగంలోకి దిగేందుకు సమాయత్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయో అన్న ఉత్కంఠ అందిరిలో కనిపిస్తున్నది.

కరీంనగర్: టీవీలో స్వేదపత్రం పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను వీక్షిస్తున్న ప్రజలు

స్వేద పత్రం.. వాస్తవ దృశ్యం

- తెలంగాణ భవన్ వేదికగా విడుదల చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ • ఆకట్టుకున్న పవర్ పాయింట్ ప్రజంటేషన్
- ఆసక్తిగా టీవీల్లో వీక్షించిన జనం • ఉమ్మడి జిల్లాలో సర్వత్రా చర్చ

పెద్దపల్లి, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): దశాబ్దాల దారిద్ర్యానికి, ఆకలి చావులకు, అవమానాలకు, ఆత్మ బలిదానాలకు, వివక్షకు, వెనుకబాటు తనానికి చరమ గీతం పాడిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాలనపై బీఆర్ఎస్ విడుదల చేసిన స్వేద పత్రం వాస్తవాలను కండ్లకు కట్టింది. చేసిన అభివృద్ధి ఏందో.. సంక్షేమ కార్యక్రమాలు ఏందో.. వెచ్చించిన మొత్తమెంతో లెక్కలతో సహా ఆవిష్కరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లో ఆవిష్కరించిన స్వేద పత్రం.. విధ్వంసం నుంచి వికాసంవైపు, సంక్షోభం నుంచి సమృద్ధివైపు నడిపించిన తీరును ప్రజల ముందు ఉంచింది. నిజానిజాలు తెలిసేలా.. అర్థమయ్యేలా తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ అసలు లెక్కలను బహిర్గతం చేసింది. తెలంగాణ ఆవిర్భావానికి ముందు, తర్వాత జరిగిన కుట్రలు, కుతంత్రాలు.. పసికూన కొత్త రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమానికి కలిగించిన ఆటంకాలను పటాపంచలు చేస్తూ దాదాపు 45 నిమిషాల పాటు కూలంకషంగా వివరించిన తీరు ఆలోచింపచేసింది. చేసిన ప్రతి అప్పు అభివృద్ధికి వెచ్చించినందున అది అప్పు కాదని ప్రజలకు ఇచ్చిన ఆస్తి అనే విషయాన్ని ప్రజలు స్వాగతించారు. కేటీఆర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను టీవీలకు అతుక్కుపోయి ఆసక్తిగా వీక్షించారు. చేసిన అభివృద్ధి, వెచ్చించిన నిధుల లెక్కలపై 'అవును ప్రతి పైసా బీఆర్ఎస్ సర్కారు ప్రజల కోసమే ఖర్చు చేసింది? అనేక సమస్యలు, ప్రజావసరాలన్నీ తీర్చింది. ఇది అప్పు ఎలా అయితది? ప్రజల ఆస్తి అయితది కదా..?' అని చర్చించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అప్పు అని ముద్రవేయడం సరికాదని సూచించారు.

పెద్దపల్లిలో..

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383-All

CHANGE OF NAME

★I, KODURI RAMA, W/o. KODURI SUDHAKAR, R/o. 2-17/A, Kokkerakunta, Ramadugu, Karimnagar, TS, changed my name as KODURI PAVANI, W/o. KODURI SUDHAKAR
NT-324490

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి

- పదేండ్లలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- కార్యకర్తలు అధైర్యపడొద్దు.. కడుపులో పెట్టి చూసుకుంటాం
- ఐదేళ్లలో బండి సంజయ్ ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి
- కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చింది
- కరీంనగర్ మాజీ ఎంపీ బీ వినోద్ కుమార్
- గుమ్లాపూర్‌లో చొప్పదండి మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

చొప్పదండి, డిసెంబర్ 24 : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని, కేసీఆర్ పాలనలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ శ్రేణులకు కరీంనగర్ మాజీ ఎంపీ బీ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని, అందరినీ కడుపులో పెట్టి చూసుకుంటామని భరోసా కల్పించారు. గుమ్లాపూర్ శివారులోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చొప్పదండి మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఐదేండ్లలో నయా పైసా పని చేయలేదని విమర్శించారు. పనులు చేయడం చేతకాని వ్యక్తిని ఎంపీగా గెలిపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత, సాధ్యం కాని హామీలు ఇచ్చి గెలిచిందని, అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీల్లోని హామీలన్నీ అమలు చేస్తామని ప్రకటించి, ఇప్పుడు ఏవో ఒకటి రెండు అమలు చేసి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో రంగాల్లో ముందుకు తీసుకెళ్లారని, కాంగ్రెస్ మాత్రం తెలంగాణను ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వందేళ్ల ముందు చూపుతోనే రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్తు ప్రాజెక్టులు నిర్మించారని చెప్పారు. గత కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో 3 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవని, కానీ స్వరాష్ట్రంలో ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి ప్రతి ఏడాదికి 10వేల మంది వైద్యులను చేసే విధంగా కేసీఆర్ కృషి చేశారని కొనియాడారు. తెలంగాణలో నిరుపేద, బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో వెయ్యికిపైగా గురుకులాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే అన్నీ అమలు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ మళ్లీ ఎడారి చేస్తుందని దుయ్యబట్టారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, ఎంపీపీ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, ఏఎంసీ చైర్మన్ చుక్కారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాంబయ్య, వినయ్, చంద్రశేఖర్ గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

- 18వ తేదీ వరకు కార్యక్రమాలు
- ప్రతి సంవత్సరం మాదిరిగానే నిర్వహణ
- వెల్లడించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ఉత్సవాల కోసం తనవంతుగా ₹5లక్షలు అందజేత

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కమాన్ చౌరస్తా, డిసెంబర్ 24: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని స్థానిక మార్కెట్ రోడ్డులోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలను ఆరేండ్లుగా వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా బ్రహ్మాండంగా జరుపుతామని చెప్పారు. నిర్వహణలో భాగంగా తన వంతుగా ₹5 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణ తేదీలను ఆలయ కమిటీ సమక్షంలో వెల్లడించారు. ఫిబ్రవరి 11న అధ్యయనోత్సవాలతో ఉత్సవాలు ప్రారంభమై, ఫిబ్రవరి 18న శోభాయాత్రతో ముగుస్తాయని తెలిపారు. 12న తదియ అంకురార్పణ ఉంటుందని, పుట్టమన్ను తెస్తారని, అదే రోజు సాయంత్రం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షబంధనం, అంకురార్పణ, శేషావాహనసేవ ఉంటాయని చెప్పారు. 13న యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ, సూర్యప్రభ వాహన సేవ, బేరి పూజా, నిత్య పూర్ణహుతి, బలిహరణం, చంద్రప్రభ వాహన సేవ.. 14న కల్పవృక్ష వాహన సేవ, ఎదుర్కోళ్ల ఉత్సవం, అశ్వవాహన, గజవాహన సేవ.. 15న మాఘ షష్ఠి గురువారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, లక్ష్మీనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం, గరుడ వాహన సేవ ఉంటాయని తెలిపారు. 16న సింహ వాహన సేవ, బలిహరణ, తీర్థప్రసాద గోష్ఠి హనుమత్ వాహన సేవ, 17న మహాపూర్ణాహుతి, చక్ర వసంతోత్సవం, పుష్పయాగం, ద్వాదశారధన, సప్తావర్ణములు, ధ్వజారోహణ, ఏకాంతసేవ, పండిత సన్మానం ఉంటాయన్నారు. 18న రాంనగర్ మార్క్ ఫెడ్ ప్రాంగణం నుంచి ఆలయం వరకు శోభా యాత్ర ఉంటుందని వివరించారు. సమావేశంలో మేయర్ యాదగిరి సునీల్ రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, ఆలయ ఈఓ ఉడుతల వెంకన్న, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, గంగాధర్, ఆలయ డైరెక్టర్ పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గందె మహేశ్, నేతి రవి వర్మ, దుడ్డెల శ్రీధర్, గంప రమేశ్, గోవిందపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.